క్లుప్తంగా

సీఐ బాధ్యతల స్వీకరణ


రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: స్థానిక అప్ గ్రేడ్ స్టేషన్ సీఐగా రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ గోపీనాథ్‌రెడ్డి బదిలీ కావడంతో ఆళ్లగడ్డ టౌన్ సీఐగా ఉన్న రమేష్‌బాబును ఉన్నతాధికారులు కొలిమిగుండ్లకు నియమించారు. నూతన సీఐకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రుణాల రికవరీ పెంచాలి


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ రవీంద్ర

కోవెలకుంట్ల: వివిధ బ్యాంకుల ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రుణాల రికవరీ శాతాన్ని పెంచాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ రవీంద్ర అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం(జేఎంఎల్‌బీసీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామైక్య సంఘం, తదితర రుణాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణం పొందాలని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు అధికారులు చంద్రశేఖర్‌రావు, ఎల్లయ్య, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ గురుస్వామి, సంజామల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ వెలుగు ఏపీఎంలు శేఖర్, బాబు, దాసన్న, సీసీలు పాల్గొన్నారు.

ట్రాక్టర్-లారీ ఢీ

- తప్పిన ప్రమాదం.. ట్రాఫిక్‌కు అంతరాయం


ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని చింతలాయిపల్లె జంక్షన్‌లో మంగళవారం లారీ-ట్రాక్టర్ ఢీకొన్నాయి. నాపరాళ్లతో తాడిపత్రికి వెళుతున్న ట్రాక్టర్.. తాడిపత్రి నుంచి కొలిమిగుండ్లకు వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. జంక్షన్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారిపై రెండు వాహనాలు ఉండిపోగా ప్రత్యామ్నాయ రహదారి లేక ఇరువైపులా వాహనాలు బారులుతీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

చౌడేశ్వరిదేవికి రూ.31.93 లక్షల ఆదాయం


లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.31.95 లక్షల ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆలయ సిబ్బంది హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు హుండీలో భక్తులు వేసిన కానుకల లెక్కింపు ద్వారా ఈ ఆదాయం వచ్చిందని ఆమె చెప్పారు. కాగా బ్యాంకు గోల్డ్ అప్రైజర్ రాకపోవడంతో భక్తులు సమర్పించిన వెండీ, బంగారం అభరణాలను లెక్కించకుండా మళ్లీ హుండీలోనే వేసినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు.

మహిళల ఆర్థిక ప్రగతికి బ్యాంకుల తోడ్పాటు


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ చంద్రశేఖర్

బనగానపల్లె రూరల్: పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పొదుపు మహిళలకు గ్రూపు రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వెలుగు సిబ్బంది శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్రకుమార్, ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి, డీపీఎం యల్లయ్య, ఏపీఎంలు తిరుపాల్‌రెడ్డి, గోపాల్, అవుకు, బనగానపల్లె మండలాలకు చెందిన ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల తన్నులాట!


అలేబాదుతండాలో తన్నుకుంటున్న టీడీపీ కార్యకర్తలు



- కొలిక్కిరాని పంపకాల పంచాయితీ
- అలేబాదు తండా టీడీపీ నాయకుల బాహాబాహి
- మరోసారి వాయిదా పడిన పంపకాల సమావేశం

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం తెలుగు తమ్ముళ్లలో కనిపించడం లేదు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రేషన్ షాపులు, డీలర్‌షిప్‌లు, అంగన్‌వాడీలు, వంట ఏజెన్సీలు అన్నీ తామే దక్కించుకోవాలని ఎదురుచూసిన ఇరు వర్గాలు చివరకు ఘర్షణలకు దిగుతున్నారు. ప్యాపిలిలోని షాదీఖానాలో మంగళవారం పంపకాల కోసం నిర్వహించిన సమావేశంలో నాగేశ్వరరావు యాదవ్, తొప్పెల శ్రీనివాసులు, అలేబాదు పరమేశ్, చంద్రపల్లి ఆచారి పాల్గొన్నారు. అయితే పంపకాల కోసం నిర్వహించిన ఈ సమావేశం మరోమారు అభాసుపాలైంది. అలేబాదుతండాకు చెందిన అలేబాదు పరమేశ్, సాలమ్మ వర్గీయులు రేషన్ షాపు తమ వర్గీయులకే కావాలని బాహాబాహికి దిగారు. పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ కిందపడేసి కొట్టుకున్నారు. దీంతో మండల స్థాయి నాయకులు ఎవరికీ సర్దిచెప్పలేక అక్కడి నుంచి జారుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల తీరు చూసి సామాన్య ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజలు కూటమికి అధికారం ఇచ్చింది ఇలా తన్నుకునేందుకేనా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గ్రూప్ రాజకీయాలు

డోన్ నియోజకవర్గం టీడీపీలో కోట్ల, కేఈ, ధర్మారం సుబ్బారెడ్డి గ్రూపులు ఉంటే మండల స్థాయిలో ఆరు గ్రూపులు ఉన్నాయి. దీంతో పంపిణీ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి తలనొప్పిగా మారింది. ప్యాపిలి మండలంలో 61 వంట ఏజెన్సీలు, 54 డీలర్ షాపులు, 25 మంది ఫీల్డు అసిస్టెంట్‌లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఉన్నవారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. మరి కొంత మందిని టీడీపీ నాయకులే నయానో భయానో తప్పించినట్లు సమాచారం. ఇంతవరకు బాగానే ఉన్నా పంపిణీ దగ్గరే అసలు సమస్య తలెత్తింది. ప్రతి గ్రామంలో ఉన్న ఐదారు గ్రూపులు వంట ఏజెన్సీలు, డీలర్‌షిప్‌లు, ఫీల్డు అసిస్టెంట్లు తమకు కావాలంటే తమకు కావాలని పోటీ పడుతున్నారు. దీంతో గతంలో నాలుగైదుసార్లు పంపిణీ కోసం నిర్వహించిన సమావేశాల్లో ఒకరినొకరు పరస్పరం దూషించుకున్నారు. దీంతో పంపిణీ సమావేశాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. ఈ సారి నిర్వహించిన సమావేశంలో షాదీఖానా ఆవరణలోనే కొట్టుకుంటూ పార్టీ ప్రతిష్టను బజారుకీడ్చారని ప్రజలు చర్చించుకుంటున్నారు.


సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

జూదరుల అరెస్ట్

- రూ.11,400 స్వాధీనం

డోన్ టౌన్: పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,400 స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వెనుక నంద్యాల రైల్వేలైన్ మధ్యనున్న ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న పాతపేటకు చెందిన దూదేకుల మహబూబ్‌బాషా, లక్ష్మయ్య, కొండపేటకు చెందిన కుంచపు రాజేష్, బాబయ్య, చాకలి ప్రసాద్, దూదేకుల బడేషా, షేక్ ఇమామ్, దొరపల్లెకు చెందిన గొల్ల గోవర్ధన్, శ్రీరాంనగర్‌కు చెందిన షేక్ మాబాషాలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహన రికార్డులు తప్పనిసరి

కోవెలకుంట్ల: వాహన చోదకులు లైసెన్సుతో పాటు వాహన రికార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని.. లేకుంటే జరిమానా విధిస్తామని కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పకడ్బందీగా పంట నమోదు


మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ-పంట యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డులోని రైతు విశ్రాంతి భవనంలో మంగళవారం కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల వ్యవసాయాధికారులు, ఏఈఓలు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లతో ఈ-పంట, వ్యవసాయ శాఖ సంబంధ పథకాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ఈ- పంట ఆధారంగానే నష్టపరిహారం అందుతుందని తెలిపారు. పంట ఇన్సురెన్స్, పంట ఉత్పత్తుల కొనుగోలు, వ్యవసాయ సబ్సిడీలు ఈ-పంట నమోదుకు అనుగుణంగా వర్తింపచేస్తామన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా వారి పేరు మీదనే పంటల వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏఓలు నిరంజన్, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్ హక్, జ్యోతి, రాజేంద్రకుమార్, సునీత, ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు


ఎగ్గొని గ్రామ సమీపంలో రోడ్డు ఇరువైపుల కంపచెట్లను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

సంజామల: ముదిగేడు-సంజామల ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వచ్చిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించారు. రోడ్డుపైకి కంపచెట్లు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జులై 29వ తేదీ 'ముందుకొచ్చిన ప్రమాదం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. రోడ్డుకు ఇరువైపులా వచ్చిన కంపచెట్లను మంగళవారం తొలగించారు. దీనిపై వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరుబయట మలవిసర్జనతో వ్యాధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: ఆరుబయట మలవిసర్జన చేయడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని.. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చొరవ చూపాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో కలిసి ఇంజినీర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆరుబయట మలవిసర్జన వల్ల కలిగే నష్టాలను వివరించి ప్రతి ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఓడీఎఫ్ ప్లస్ సర్వే గృహ నిర్మాణంపై పురోగతి చూపాలని ఆదేశించారు. పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమణ, క్రిష్ణారెడి కరిముల్లా, ఈఓఆర్‌డీ రామ క్రిష్ణవేణి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్: చెత్తను సరైన విధానంలో వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. వీటితో ఎరువు తయారు చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగిస్తారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించగలిగితే పర్యావరణాన్ని కాపాడగలిగిన వారమవుతామన్నారు. పట్టణ ప్రజలు సింగిల్ యూజుడ్ ప్లాస్టిక్ లేదా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వినియోగించాలని సూచించారు. డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: కేరళ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేనుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలోని రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు విద్యార్థులు బనగానపల్లె పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 2వ తేదీ కేరళలో వచ్చిన వరదల వల్ల వాయనాడు జిల్లాలో మూడు గ్రామాల ప్రజలు సరస్వాన్ని కోల్పోయినట్లు తెలిపారు. ఈ విపత్తులో వందలాది మంది కుటుంబాలను, ఆస్తులను కోల్పోవడం అందరినీ కలచివేసినట్లు తెలిపారు. కేరళ బాధితులను ఆదుకునేందుకు విద్యార్థులు చేపట్టిన విరాళాల సేకరణ అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు పట్టణ ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ బడేసాహెబ్, వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈరోజు

నేడు నంద్యాల వైపు ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె నుంచి నంద్యాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను బుధవారం దారి మళ్లించినట్లు బనగానపల్లె ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. పాణ్యం వద్ద రైల్వేలైన్ మరమ్మతు పనుల కారణంగా నంద్యాలకు వాహనాల రాకపోకలను ఉదయం నుంచి సాయంత్రం వరకు రైల్వే అధికారులు నిలిపివేసినట్లు తెలిపారు. నంద్యాలకు వెళ్లే బస్సులను గోనవరం, భూపణపాడు, బలపనూరు మీదుగా నంద్యాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు ఉచిత విద్యుత్ ఉదయం 3 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఐటీఐలో మిగిలిపోయిన కోపా, వెల్డర్ కోర్సుల్లో సీట్ల కోసం ఈనెల 26వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 27వ తేదీ సరిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

అనారోగ్యంతో లైన్‌మన్ మృతి

కోవెలకుంట్ల: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మురళీ(43) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఉయ్యాలవాడకు చెందిన మురళీ మూడేళ్లుగా కోవెలకుంట్ల లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నంద్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏడీ ఖాజావలి, ఏఈ రామమోహన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం రైల్వే గేటు సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం దాడులు నిర్వహించినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా తెలిపారు. గూటుపల్లె గ్రామానికి చెందిన శీలం శ్రీరాములును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

డోన్ టౌన్: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ హరికృష్ణ తన ఆటోలో దొరికిన పర్సును పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. జూలై 29వ తేదీ ఫాతీమా అనే మహిళ పట్టణంలోని కంబాలపాడు సర్కిల్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద హరికృష్ణ ఆటో ఎక్కి తారకరామనగర్ ఆటో స్టాండ్ వరకు ప్రయాణించి దిగిపోయింది. తన పర్సును ఆటోలో మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత ఆటోలో ఉన్న పర్సును చూసి తెరిచి చూడగా అందులో రూ.4,700 నగదు, నంద్యాల అడ్రస్సుతో ఉన్న ల్యాబ్ రిపోర్టు ఉంది. కొద్ది రోజులు ఎదురు చూసి మంగళవారం పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డికి నగదు, పర్సు అందజేశాడు. ఆటో డ్రైవర్ హరికృష్ణ నిజాయితీని పోలీసులు అభినందించారు. బాధితురాలు తగిన ఆధారాలతో స్టేషన్‌కు వచ్చి పర్సు తీసుకోవాలని కోరారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

అవుకు: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన చెన్నప్ప (44) మద్యానికి బానిసై తరచూ భార్య మరియమ్మతో గొడవ పడేవాడు. మంగళవారం మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఇంటి ముందర కల్లాపి చల్లే మందును తాగి మృతి చెందాడు. భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

డోన్‌లో దంచికొట్టిన వాన


డోన్.. రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

డోన్ టౌన్: పట్టణంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. డోన్‌తో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 7 గంటల నుంచి గంటన్నపాటు వర్షం దంచికొట్టడంతో వీధులు, కాలువల్లో నీరు పొంగిప్రవహించాయి. రోడ్లు జలమయమయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగు చేసిన తర్వాత ఇంత పెద్ద వాన కురవడం ఇదే అని రైతులు హర్షం వ్యక్తం చేశారు. వర్షం లేక సద్ద, జొన్న, ఆముదం కొర్ర పంటలు వాడుముఖం పట్టాయని.. ఈ వర్షంతో ఉపశమనం లభించిందని పేర్కొన్నారు.

బేతంచెర్లలో మోస్తరు వర్షం

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. సుమారు 20 రోజులుగా సరైన వర్షం లేక వాడుతున్న కొర్ర, సజ్జ, కంది, మినుము, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం కొంత మేర ఊపిరి పోసిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఖరీఫ్ పంటలకు ఊపిరి

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మంగళవారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వర్షం కురవడంతో రైతులు ఊరట చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము, పత్తి, కంది, పెసర, మొక్కజొన్న, ఆముదం, తదితర పంటలకు వర్షం అనుకూలంగా మారింది. అలాగే ఈ నెలలో సాగు చేయాల్సిన మిరప, జొన్న, తదితర పంటలకు ఉపయోగకరంగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు వేయడం సరికాదు


ఆర్డీఓ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

డోన్ టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకులకు నైట్ డ్యూటీలు వేయడం సరికాదని.. ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు నందిపల్లె నగేష్, మండల అధ్యక్షుడు రామచంద్రుడు కోరారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తూ వీఆర్‌ఏలను నైట్ డ్యూటీలకు పంపడం సరికాదన్నారు. అర్హులైన వారికి వాచ్‌మెన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌ఏలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. తెలంగాణ తరహాలో మన రాష్ట్రంలో వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలన్నారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యమాలకు సిద్ధం అని పేర్కొన్నారు. వీఆర్‌ఏలు చంద్రశేఖర్, కృష్ణ, మనోహర్, గోపాల్, రామనాయుడు, లక్ష్మన్న, రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

పంట నమోదుపై శిక్షణ


మాట్లాడుతున్న ఏఓ కిరణ్ కుమార్

బేతంచెర్ల: మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదుపై ఏఓ కిరణ్ కుమార్ వారికి శిక్షణ ఇచ్చారు. ప్రతి రైతు వివరాలు నమోదు చేయాలని సూచించారు. పంట నమోదు చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, పంట నష్టపరిహారం, బీమా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ జాతర


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దొరపల్లె రోడ్డులో వెలసిన రేణుక ఎల్లమ్మ జాతరను ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు డప్పు వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన రాచుట్టి బుజ్జి, కృష్ణమ్మ భక్తులకు అన్నాదానం చేశారు.

జోరందుకున్న వరినాట్లు

ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో ముత్యాలవాగు చెరువు నిండుకుండను తలపిస్తోంది. సమృద్ధిగా నీరు ఉండడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. దుక్కులు చేయడం, నారులు పోయడం, వరి నాట్లు వేయడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ముక్కమల్ల ముత్యాలవాగు చెరువు కింద ముక్కమల్ల, ముచ్చలపురి, ఎగ్గొని, ఆల్వకొండ గ్రామాల రైతులు ఆధారపడ్డారు. సాధారణంగా ఈ చెరువుకింద సుమారు 300 ఎకరాల వరిసాగు చేస్తారు. ఇప్పటి వరకు చెరువు కింద 50 ఎకరాలు వరి నాట్లు పూర్తయ్యాయి.

– సంజామల


చెరువు కింద వరినారు పోసిన రైతులు


వరినాట్లకు సిద్ధం చేసిన పొలం


పొలంలో నాటిన వరి